పీఠం కదులుతోందా..!

మేయర్ సీటుపై ముగ్గురి కన్ను

స్టాండింగ్ కమిటీ ఎన్నికల ముసుగులో పావులు

పసిగట్టి.. అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే అనంత


నామినేషన్ వేస్తున్న వైసీపీ కార్పొరేటర్లు



అనంతపురం క్రైం, ఆగస్టు 28: వైసీపీ నాయకులకు నగరపాలిక కార్పొరేటర్లు ఎక్కడ జారిపోతారోనని బెంగ పట్టుకుంది. మేయర్ పదవిపై కన్నేసిన ఆ పార్టీలోని ఇద్దరు ముగ్గురు కార్పొరేటర్లు.. వారం రోజులుగా బేరసారాలు సాగిస్తున్నారని సమాచారం. గంపగుత్తగా టీడీపీలోకి చేరడం ద్వారా మేయర్ పీఠాన్ని చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలను ఇందుకు వాడుకోవాలని చూశారు. మాజీ ఎంపీ అనుచరుడి ద్వారా కార్పొరేటర్లకు గాలం వేశారు. పార్టీ మారితే ఒక్కొక్కరికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఇస్తామని బేరం పెట్టినట్లు తెలిసింది. కొందరు దీనికి సై అన్నట్లు సమాచారం. మరికొందరు ఎక్కువ డబ్బులు డిమాండ్ చేశారని తెలిసింది. దీంతో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి జోక్యం చేసుకుని బేరసారాలకు అడ్డుకట్ట వేశారని ప్రచారం జరుగుతోంది. పార్టీ మారే ఆలోచన చేస్తే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని అధినాయకత్వం ద్వారా బెదిరించారని సమాచారం. ఈ క్రమంలో కొందరు కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమై.. వెనకడుగు వేశారని అంటున్నారు.

గంటన్నర ముందు నామినేషన్లు

స్టాండింగ్ కమిటీ ఎన్నికలలో నామినేషన్లు వేయడానికి మూడు రోజులు గడువు ఇచ్చారు. అయినా చివరి రోజు, అందులోనూ గంటన్నర ముందు నామినేషన్లు వేశారు. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే అనంత చక్రం తిప్పినట్లు తెలిసింది. ఎవరెవరు నామినేషన్లు వేస్తారో బుధవారం మధ్యాహ్నం వరకు తెలియకుండా జాగ్రత్తపడినట్లు తెలిసింది. పాలకవర్గంలోని టాప్ త్రీలో ఒకరికి చివర్లో ఆ ఐదుగురి జాబితా తెలిసినట్లు సమాచారం. చివరకు కార్పొరేటర్లు సుజాత, నాగ వినీత, నరసింహులు, అనిల్‌కుమార్ రెడ్డి, రహంతుల్లా నామినేషన్లు దాఖలు చేశారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్య సమక్షంలో వీరు నామినేషన్లు దాఖలు చేశారు. వీరు ఏకగ్రీవం కానున్నారు. ఇదివరకు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఉన్న నలుగురు కార్పొరేటర్లు మరోసారి తాము నామినేషన్ వేస్తామని అడిగినట్లు తెలిసింది. దీంతో ప్రతిసారీ వారేనా..? కొత్తవారికి అవకాశం ఇవ్వాలని వాదించారట.

31వ తేదీనే పింఛన్

2.84 లక్షల మందికి రూ.124.74 కోట్లు


పింఛన్ల పంపిణీపై ఆదేశాలిస్తున్న కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్/టౌన్, ఆగస్టు 28: వచ్చే నెల ఒకటో తేదీన ఆదివారం కావడంతో పింఛన్ పంపిణీని ఈ నెల 31న చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. సెప్టెంబరు నెలకు సంబంధించి జిల్లాలోని 2,84,358 మంది లబ్ధిదారులకు రూ.124.74 కోట్లు మంజూరయ్యాయి. 31వ తేదీ శనివారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్లను పంపిణీ చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్ల పంపిణీలో గత నెలలో జిల్లా మూడో స్థానంలో ఉందని, కొన్ని ప్రాంతాలలో ఉదయం 10 గంటల వరకూ పంపిణీ మొదలు కాలేదని అన్నారు. ఈసారి అలాంటి పరిస్థితి ఉండకూడదని హెచ్చరించారు. తొలిరోజే వందశాతం పంచాలని సూచించారు. బయోమెట్రిక్ డివైజ్, యాప్‌లో ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జేసీ శివనారాయణశర్మ, డీపీఓ ప్రభాకరరావు, డీఆర్‌డీఏ పీడీ ఓబులమ్మ, ఆర్డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు సమీక్షలో పాల్గొన్నారు.

వృద్ధులకు ప్రాధాన్యం ఇవ్వండి..

వయో వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమస్యలతో వచ్చే వృద్ధులకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక రిజిస్టర్ పెట్టి వివరాలు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులలో ప్రత్యేక సీట్లు కేటాయించాలని, ఆ సీట్లలో వారే కూర్చునేలా చూడాలని ఆదేశించారు. ఆస్పత్రులలో ప్రత్యేక ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖలలో బిల్లులు చెల్లించడం కోసం కూడా వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వయోవృద్ధుల కమిటీలు ఏర్పాటు చేసి, వారికి వచ్చే పథకాలు, లబ్ధి గురించి తెలియజేయాలని అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్డీఓలు రాణి సుష్మిత, శ్రీనివాసులు రెడ్డి, దివ్యాంగుల శాఖ ఏడీ రసూల్, డీఎంహెచ్ఓ ఈబీ దేవి తదితరులు పాల్గొన్నారు.

చైర్ పర్సన్ వాకౌట్

మున్సిపల్ సమావేశంలో విడ్డూరం

స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలో వైసీపీ తొండాట

కమిషనర్ వద్ద నిరసన తెలిపిన టీడీపీ


కృష్ణారెడ్డి పేరును ప్రకటించడానికి మైకు తీసుకున్న చైర్‌పర్సన్ భవాని


పేరు ప్రతిపాదించడానికి మీరెవరంటూ వైసీపీ కో-ఆప్షన్ సభ్యులతో వాదనకు దిగిన టీడీపీ కౌన్సిలర్లు..


కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న నారాయణ స్వామి, కృష్ణారెడ్డి

గుంతకల్లు, ఆగస్టు 28: మున్సిపాలిటీపై పట్టు సడలుతోందని భావించి.. కౌన్సిల్ సమావేశం నుంచి చైర్‌పర్సన్, కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. గుంతకల్లు మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్ పదవి అంశాన్ని సాధారణ సమావేశం అజెండాలో చేర్చారు. చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. అజెండా చదువుతుండగానే అన్ని సబ్జెక్టులను ఆమోదిస్తున్నామని, 13వ అంశంగా ఉన్న స్టాండింగ్ కౌన్సిల్ నియామకపు విషయాన్ని చదవాలని వైసీపీ కౌన్సిలర్లు కోరారు. ఈ పదవికి మొత్తం ఏడుగురు న్యాయవాదులు దరఖాస్తు చేశారు. బీఎస్ కృష్ణారెడ్డి పేరును టీడీపీ కౌన్సిలరు కృపాకర్ ప్రతిపాదించారు. వైసీపీ తరఫున గోపాలకృష్ణ పేరును పోటీలో ఉంచినా, మెజారిటీ లేదన్న కారణంగా వైసీపీ కౌన్సిలర్లెవరూ ఆయన పేరును ప్రతిపాదించలేదు. దీంతో కృష్ణారెడ్డి ఏకగ్రీవమయ్యారు. ఆయన నియామకాన్ని ప్రకటించడానికి చైర్‌పర్సన్ భవాని మైక్ తీసుకోగానే వైసీపీ కో-ఆప్షన్ సభ్యులు రాజశేఖర్, ఫ్లయింగ్ మహబూబ్ తమ తరపు నుంచి గోపాల కృష్ణ పేరును ప్రతిపాదించారు. ఓటు హక్కులేని కో-ఆప్షన్ సభ్యులకు పేరును ప్రతిపాదించే అర్హత ఉండదని టీడీపీ కౌన్సిలరు పవన్ కుమార్ గౌడు అభ్యంతరం చెప్పారు. స్టాండింగ్ కౌన్సిల్ నియామకానికి ఓటింగ్ తప్పని పరిస్థితి ఏర్పడింది. అనారోగ్యం కారణంగా కౌన్సిల్ హాల్‌లోకి రాలేక, సంతకం చేసి బయట కూర్చున్న టీడీపీ కౌన్సిలరు నాగరత్నను సమావేశంలోకి తీసుకురావడానికి ఆ పార్టీ నాయకులు వెళ్లారు. అదే సమయంలో చైర్‌పర్సన్ భవాని కౌన్సిల్ హాల్ నుంచి వెళ్లిపోయారు. ఇదే అదనుగా వైసీపీ కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. సాధారణంగా అధికార పక్షం తీరుకు నిరసన ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేస్తారు. కానీ సభకు అధ్యక్షత వహించిన చైర్ పర్సన్ వాకౌట్ చేయడం ఏమిటని పలువురు విమర్శించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి కమిషనర్‌ను కలసి నిరసన తెలిపారు. చైర్ పర్సన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చూస్తూ కూర్చోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెలాఖరులోగా అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తామని కమిషనర్ వెంకట రమణయ్య చెప్పడంతో టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు శాంతించారు.

కలుపు తీయలేం..!

అందుకే పంట తొలగింపు

అధికారుల వద్ద రైతు ఆవేదన


ట్రాక్టర్‌తో కంది పైరును రొటావేట్ చేయిస్తున్న రైతు

విడపనకల్లు, ఆగస్టు 28: మండల వ్యాప్తంగా మిర్చి, కంది పంటలను రైతులు తొలగిస్తూనే ఉన్నారు. ఆర్.కొట్టాలలో రైతు లక్ష్మీదేవి కంది పంటను ట్రాక్టర్‌తో దున్నేశారు. అధిక వర్షాలకు పంట మొత్తం పసుపు రంగులోకి మారడం, కలుపు అధికంగా ఉండటంతో దిక్కుతోచక పంటను తొలగించారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు గ్రామానికి వెళ్లి లక్ష్మీదేవితో చర్చించారు. కంది పైరును తొలగించవద్దని, గడ్డి మొక్కలు తొలగిస్తే కంది దిగుబడి బాగా వస్తుందని సూచించారు. అయితే కలుపు తొలగించేందుకు అయ్యే ఖర్చును భరించలేమని ఆమె అధికారులతో అన్నారు. ప్రత్యామ్నాయంగా జొన్న సాగు చేస్తానని అన్నారు. దీంతో 90 శాతం సబ్సిడీతో సీడ్ జొన్న అందిస్తామని ఏడీఏ పద్మజ, ఏఓ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర ఆమెకు తెలిపారు. తొలగిస్తున్న కంది పంటకు ఈ-క్రాప్ బుకింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఇదే గ్రామానికి చెందిన శ్రీరాములు 12 ఎకరాల్లో సాగుచేసిన మిరప పంటను తొలగించాడు. రెండోసారి కూడా మిరప విత్తనం వేశాడు. నెల రోజుల్లో లక్షలాది రూపాయలు నష్టపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.


రెండోసారి 12 ఎకరాల్లో మిరప విత్తనం వేస్తున్న రైతు



వీసీలు మారారు.. మరి ఈసీలు..?

పాలకమండలి నియామకంలో జాప్యం

వర్సిటీల్లో ఆగిపోయిన కీలక పనులు

ఆశావహుల ఎదురుచూపు

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూ, ఎస్కేయూలో పెండింగ్ ఫైళ్లు పేరుకుపోతున్నాయి. అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ అంశాల్లోని కీలకమైన పనులన్నీ నిలిపోయాయి. ఉద్యోగోన్నతులు, నియామకాలదీ అదేవరస. తరగతులు, పరీక్షలు, ఫలితాలు, జీతభత్యాలు వంటి ప్రక్రియలు మాత్రమే యథావిధిగా కొనసాగుతున్నాయి. పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలంటే పాలకమండలి(ఈసీ) ఆమోదం పొందాలి. అకడమిక్, అడ్మినిస్ట్రేషన్, పదోన్నతులు వంటి అంశాలకు ఈసీ పర్మిషన్ తీసుకోవాలి. నూతన ఈసీని ఏర్పాటు చేయకపోవడంతో పనులన్నీ పెండింగ్‌లో పడ్డాయని వర్సిటీ వర్గాలు అంటున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కీలకమైన పదవుల్లో కొనసాగుతున్న వారిని, పాలకమండలి సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి వారిని విధుల నుంచి తొలగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై దాదాపు మూడు నెలలు అవుతున్నా వైసీపీ ప్రభుత్వం నియమించిన వారే పాలక మండలిలో కొనసాగుతున్నారు. దీంతో కీలకమైన అంశాలు పెండింగ్‌లో పడ్డాయి.

ఆదేశాలే తరువాయి...

ఈసీ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. వర్సిటీల్లో డీన్, డైరెక్టర్, కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీ, వార్డెన్, మేనేజర్ తదితర పదవులను వీసీలు నియమిస్తారు. వీసీల ఆదేశాల మేరకు రిజిస్ట్రార్లు ఉత్తర్వులు జారీచేస్తారు. వాటిని అమోదించేందుకు ఈసీ సమావేశాన్ని నిర్వహించాలి. జేఎన్‌టీయూలో కొన్ని విభాగాల్లో కొత్తవారిని నియమించారు. ఎస్కేయూలో ఏ విభాగంలోనూ మార్పులు చేయలేదు. పూర్తిస్థాయిలో మార్పులు చేయాలన్నా, వర్సిటీల పాలన, అభివృద్ధి, నూతన నిర్మాణాలు, కొత్త ఆలోచనలు అమలు చేయాలన్నా ఈసీని నియమించాలి. వీటన్నటికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలే తరువాయి అని వర్సిటీల వర్గాలు పేర్కొంటున్నాయి.



ఉన్నత విద్యనందించే వర్సిటీల్లో పారదర్శకమైన నిర్ణయాలు, వాటి అమలుతో విద్యార్థుల భవిష్యత్తు, ఉద్యోగుల సంక్షేమం ఆధారపడి ఉంటుంది. అర్హత, అనుభవమున్న అధికారులను నిర్దేతలుగా నియమించాల్సిన చోట అనర్హులకు అందలమెక్కించారు. పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాల మూల్యాంకణం, ఉద్యోగుల బదిలీలు, ఉద్యోగోన్నతులు.. ఇలా అనేకాంశాల్లో ఇష్టానుసారంగా వ్యవహరించారు. దీంతో గత ఐదేళ్ల వర్సిటీల ఖ్యాతి మసకబారింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పాదర్శకమైన పాలన అందించేందుకు అడుగులు పడ్డాయి. వర్సిటీలకు కొత్తగా ఇన్‌చార్జ్ వీసీలు, రిజిస్ట్రార్లు నియమితులయ్యారు. ఇక అర్హత, అనుభవమున్న వారిని కీలకమైన పదవుల్లో నియమించాల్సి ఉంది. వారి ఆలోచనలు ఈసీ సమావేశంలో చర్చించి అమలు చేయాలి. దీంతో కీలకమైన పదవులు, ఈసీ సభ్యులుగా చోటుదక్కించుకునేందుకు అనేకమంది ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య


కుల్‌దీప్ పరివార్, మీనా (ఫైల్)

గుంతకల్లు, ఆగస్టు 28: తమ ప్రేమను పెద్దలు అంగీకరించలేదన్న కారణంగా గుంతకల్లు పట్టణానికి చెందిన యువ జంట రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద సంఘటన కర్నూలు జిల్లా మద్దికెర మండలం మల్లప్ప గేట్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్ రాష్ట్రం ధాటియా జిల్లాకు చెందిన కుల్‌దీప్ పరివార్(19) గుంతకల్లు పట్టణంలో పానీపూరి బండిని నిర్వహించేవాడు. అదే రాష్ట్రానికే చెందిన ప్రతాప్ సింగ్ కూతురు మీనా (18) పట్టణంలోని ఓ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతోంది. రెండు కుటుంబాలకూ ముందునుంచి పరిచయాలు ఉన్నాయి. కుల్‌దీప్ కుటుంబ సభ్యులు అతడికి వివాహం చేయడానికి సంబంధాలు చూస్తున్నారు. దీంతో తాను మీనాను ఇష్టపడుతున్నానని, ఆమెను వివాహం చేసుకుంటానని కుల్‌దీప్ ఇంట్లో తెలిపాడు. కానీ కుల్‌దీప్ సోదరుడు అంగీకరించలేదని సమాచారం. ఈ పరిస్థితుల్లో కుల్‌దీప్, మీన మంగళవారం ఇళ్ల నుంచి అదృశ్యమయ్యారు. మీన తండ్రి ప్రతాప్ సింగ్ కసాపురం పోలీసులో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లా మల్లప్పగేట్ వద్ద యువతీ యువకులు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారన్న సమాచారం జీఆర్పీ పోలీసులకు చేరింది. రెండు కుటుంబాలవారు వెళ్లి మృతదేహాలను గుర్తించారు. తమ చావుకు ఎవరూ కారణం కాదని వారిద్దరూ రాసిన వాంగ్మూలాన్ని పోలీసులు ఘటనా స్థలం వద్ద స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తల్లితో కలిసి తండ్రిని చంపిన కొడుకు



మృతిచెందిన తిప్పేస్వామి నాయక్, తిప్పేస్వామి నాయక్ (ఫైల్)

బెళుగుప్ప, ఆగస్టు 28: మండల పరిధిలోని ఎలగలవంక తండాలో మంగళవారం రాత్రి తల్లితో కలిసి కొడుకు తండ్రిని చంపేశాడని ఎస్ఐ శివ తెలిపారు. వ్యసనాలకు బానిసై, అప్పులు చేస్తూ జులాయిగా తిరుగుతున్న రాజశేఖర్ నాయక్‌ను ఆయన తండ్రి తిప్పేస్వామినాయక్ (53) దండించాడు. దీంతో తాగిన మైకంలో ఉన్న కొడుకు.. తన తల్లి లక్ష్మీబాయితో కలిసి తండ్రిపై దాడి చేశాడు. గొంతు నులిమి చంపేశాడు. తండాలో మంగళవారం జాతర జరిగింది. అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిపై తన కళ్లెదుటే దాడి జరుగుతుండటంతో కూతురు కేకలు వేసింది. కానీ జాతర సందడిలో ఆమె అరుపులు ఎవరికీ వినిపించలేదు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శివ, ఏఎస్ఐ రామదాసు బుధవారం గ్రామానికి వెళ్లి విచారించారు. కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

చీమలవాగుపల్లి వద్ద బైకును ఢీకొన్న లారీ

అర్జాస్ వద్ద బైకును ఢీకొన్న కారు


ప్రమాదస్థలంలో మృతదేహాలు


దెబ్బతిన్న ద్విచక్రవాహనం


శ్రీనివాసులు (ఫైల్)


రాజేష్ (ఫైల్)


వివేకానంద (ఫైల్)

తాడిపత్రి, ఆగస్టు 28: నియోజకవర్గ పరిధిలో బుధవారం జరిగిన రెండు ప్రమాదాల్లో ముగ్గురు ద్విచక్రవాహనదారులు మృతిచెందారు. పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి టోల్‌గేట్ వద్ద బైకును లారీ ఢీకొట్టడంతో యాడికి మండల కేంద్రానికి చెందిన శ్రీనివాసులు (28), నార్పల మండలం నాయనపల్లికి చెందిన రాజేష్ (27) అక్కడికక్కడే మృతిచెందారు. శ్రీనివాసులు లారీ డ్రైవర్ కాగా, రాజేష్ బేల్దారి పనులు చేసుకునేవాడు. వీరిద్దరూ బంధువులు. తాడిపత్రిలో బంధువుల ఇంట వివాహానికి వచ్చి, ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో యాడికి పట్టణానికి బయలుదేరారు. చీమలవాగుపల్లి సమీపంలో టోల్‌గేట్ వద్దకు రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న లారీ అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసులుకు భార్య అనూష, కుమారుడు ఉన్నారు. రాజేష్‌కు భార్య శ్రీలత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరి మరణంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అర్జాస్ వద్ద.. : తాడిపత్రి-కడప రహదారిలో ఉన్న అర్జాస్ స్టీల్ పరిశ్రమ సమీపంలో ద్విచక్రవాహనాన్ని బుధవారం కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బోడాయిపల్లి గ్రామానికి చెందిన వివేకానంద (18) అక్కడికక్కడే మృతిచెందారు. వివేకానంద కూలి పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. వ్యక్తిగత పనిమీద బైక్‌పై తాడిపత్రికి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. మృతుడి తల్లి పుల్లమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

టమోటా రైతులకు సబ్సిడీలు ఇవ్వండి

కలెక్టర్, జేసీకి ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి


కలెక్టర్‌ను కలిసిన పరిటాల సునీత

అనంతపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పందిరి పద్ధతిలో టమోటా సాగు చేసేందుకు రైతులకు సబ్సిడీ ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జేసీ శివనారాయణ శర్మను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. కలెక్టరేట్‌లో వారిని ఎమ్మెల్యే బుధవారం కలిసి.. నియోజకవర్గ సమస్యలను వివరించారు. ధరల హెచ్చుతగ్గుల కారణంగా టమోటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. నిపుణుల సూచన మేరకు సాహో రకం విత్తనాన్ని సబ్సిడీతో ఇవ్వాలని, స్టేకింగ్ పద్ధతికి, రాయితీలు ఇవ్వాలని, మల్చింగ్ సీటుకు రాయితీ పెంచాలని కోరారు. సాహో రకానికి ఢిల్లీ, బంగ్లాదేశ్‌లో భారీగా డిమాండ్ ఉందని స్టేకింగ్ పద్ధతిలో సాగు చేస్తే ఆరు నెలల పాటు పంట దిగుబడి వస్తుందని అన్నారు. వైసీపీ పాలనలో రేషన్ డీలర్లు బఫర్‌ను ఎక్కువగా చూపడం వల్ల ప్రస్తుతం డీలర్లకు తక్కువగా రేషన్ అందుతోందని, బఫర్‌ను జీరో చేయాలని కోరారు. గతంలో జరిగిన రేషన్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాప్తాడు సమీపంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో జాకీ తరహా పరిశ్రమలను అప్పటి నాయకులు కమీషన్ల కోసం వెళ్లగొట్టారని, ప్రభుత్వం మారినందున పరిశ్రమలు తీసుకురావాలని అన్నారు. అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో తాగునీటి పథకాల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఆగిపోయిన పనులను పూర్తి చేయించాలని కోరారు. కలెక్టర్, జేసీ సానుకూలంగా స్పందించారు. అన్ని అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఎస్పీతో భేటీ

ఎస్పీ జగదీష్‌తో ఎమ్మెల్యే పరిటాల సునీత భేటీ అయ్యారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల గురించి చర్చించారు. గతంలో నమోదు చేసిన అక్రమ కేసుల గురించి ఎస్పీకి వివరించారు. నిష్పక్షపాతంగా పనిచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఎస్పీ సానుకూలంగా స్పందించారు.

నగరంలో పీడీఎస్‌యూ రాష్ట్ర వైజ్ఞానిక తరగతులు

సెప్టెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్, పీడీఎస్‌యూ నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు 28: నగరంలో వచ్చేనెల 2వ తేదీ నుంచి పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక తరగతులు నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భాస్కర్, జిల్లా ప్రధానకార్యదర్శి వీరేంద్రప్రసాద్ తెలిపారు. వైజ్ఞానిక తరగతులకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఎస్కేయూలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని యాదవ భవన్‌లో నాలుగురోజులపాటు తరగతులు, జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చి విద్యావ్యవస్థని ప్రైవేటీకరణ చేస్తోందని మండిపడ్డారు. వర్సిటీల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విద్యారంగానికి శాపంగా మారిన జీవోలు 84, 85, 117 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నగర అధ్యక్షుడు శంకర్, యూనివర్సిటీ నాయకులు తేజ, నరేష్, రాఘవేంద్ర, అబి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో పలువురు ఇంజనీర్ల బదిలీ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28: గ్రామీణ నీటి సరఫరా విభాగంలో పలువురు ఇంజనీర్లు బదిలీ అయ్యారు. మంగళవారం కర్నూలు సర్కిల్ కార్యాలయంలో కౌన్సిలింగ్ ప్రక్రియ జరిగింది. ఇచ్చిన ఆప్షన్స్‌కు అనుగుణంగా ప్లేస్‌మెంట్స్ కేటాయించారు. శింగనమల డీఈగా ఉన్న గంగాధర్ బుక్కపట్నం డీఈగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తాడిపత్రి డీఈగా ఉన్న శ్రీరాములును నియమించారు. రాప్తాడు డీఈగా ఉన్న రెహనా వసీం కర్నూలుకు బదిలీ కాగా ఆయన స్థానంలో పులివెందుల నుంచి శ్రీధర్ నియమితులయ్యారు. కళ్యాణదుర్గం ఆపరేషన్స్ అండ్ మెయిన్‌టెనెన్స్ డీఈగా ఉన్న శ్రీనివాసులు రాయదుర్గానికి బదిలీ అయ్యారు. క్వాలిటీ కంట్రోల్ డీఈగా ఉన్న కుసుకుమార్ గుత్తికి, కదిరి డీఈగా వెంకటేశ్వరులు, హిందూపురం డీఈగా శివనాగేశ్వరరావు నియమితులయ్యారు. శింగనమల ఏఈ శ్రీనివాసులు కుందుర్పికి బదిలీ కాగా.. ఆ స్థానంలో నార్పల ఏఈ రవీంద్రనాథ్‌రెడ్డిని నియమించారు. గార్లదిన్నె ఏఈ కల్యాణిని అనంతపురం డివిజన్‌కు, బుక్కరాయసముద్రం ఏఈగా ఉన్న జనార్దన్ నార్పలకు బదిలీ అయ్యారు. పుట్లూరు ఏఈగా ఉన్న రామలింగారెడ్డి గుత్తి ప్రాజెక్ట్‌కు, అనంతపురం రూరల్ ఏఈ ఆంజినేయులు పెద్దవడుగూరుకు, ఆత్మకూరు ఏఈగా ఉన్న హరి అనంతపురం రూరల్‌కు బదిలీ చేశారు. వరలక్ష్మిని రాప్తాడుకు, రాప్తాడు ఏఈ వెంకటేష్‌ను బత్తలపల్లికి బదిలీ చేసినట్లు తెలిసింది.

కొత్తగా 9 ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు

కేంద్ర మంత్రివర్గం ఆమోదం

అనంత, తాడిపత్రి, గుంతకల్లులో ఏర్పాటుకు ఓకే..

అనంతపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా 9 ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఆ మేరకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రివర్గం సమావేశంలో ఆమోదం తెలిపారు. దేశవ్యాప్తంగా 234 నగరాలు, పట్టణాల్లో ఎఫ్‌ఎం రేడియోను ప్రారంభించేందుకు మంత్రివర్గం తెలిపింది. అందులో భాగంగా జిల్లాకు 9 ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లను కేటాయించారు. జిల్లాలోని అనంతపురం నగరంలో 3, గుంతకల్లు పట్టణంలో 3, తాడిపత్రి పట్టణంలో 3 ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. కొత్తగా ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం లేకపోలేదు. మాతృభాషలో పరిజ్ఞానాన్ని మరింత పెంపొందించడంతోపాటు కొత్తగా ఉపాధి అవకాశాలను కల్పించడంలో భాగంగానే ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు ఏర్పాటు చేయడం వెనుక ప్రధాన ఉద్దేశంగా కేంద్ర మంత్రిమండలి పేర్కొంది. స్థానిక మాండలికం, సంస్కృతిని పెంపొందించడానికి, స్థానికులకు అవకాశాలు, ఇతరత్రా కార్యక్రమాల ప్రోత్సాహానికి ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు ఉపయోగపడనున్నాయి.

శ్రీసత్యసాయి జిల్లాలో ఆరింటికి ఆమోదం

హిందూపురం: శ్రీసత్యసాయి జిల్లాలో ఆరు ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. హిందూపురంలో మూడు, ధర్మవరంలో మూడు ఎఫ్‌ఎం స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.

తిరుపతి-కాచిగూడ మధ్య ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఆగస్టు 28: ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి కాచిగూడ-తిరుపతి-కాచిగూడ మధ్య (వయా గుత్తి) ఆరు ట్రిప్పుల అప్ అండ్ డౌన్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ-తిరుపతి (నెం. 07653) రైలు అక్టోబరు 10వ తేదీ నుంచి నవంబరు 4వ తేదీ వరకు ఆరు గురువారాలలో నడపనున్నట్లు తెలిపారు. ఈ రైలు కాచిగూడలో గురువారం రాత్రి పదిన్నరకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10-10 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు. అలాగే దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07654) అక్టోబరు 11వ తేదీ నుంచి నవంబరు 15వ తేదీ వరకు ఆరు శుక్రవారాలలో తిరుపతిలో రాత్రి 8-05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం తొమ్మిదిన్నరకు కాచిగూడకు చేరుకుంటుందని తెలియజేశారు. ఈ రైళ్లు ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, యర్రగుంట్ల, కడప, రేణిగుంట స్టేషన్ల మీదుగా పయనిస్తాయన్నారు.

డీఆర్‌ఎంను కలిసిన జీఆర్పీ ఎస్పీ

గుంతకల్లు, ఆగస్టు 28: జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా బుధవారం స్థానిక డీఆర్‌ఎం విజయకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డీఆర్‌ఎం కార్యాలయానికి వచ్చిన ఎస్పీ రైల్వేలో భద్రతాసమస్యలపై చర్చించారు. ఆర్పీఎఫ్ పోలీసుల సమన్వయంతో రైళ్లల్లో చోరీలను నియంత్రించడానికి కృషిచేయాలని డీఆర్‌ఎం విజయకుమార్.. ఎస్పీకి సూచించారు.

రేపు సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్

అనంతపురం క్రైం, ఆగస్టు 28: అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో సచివాలయ ఉద్యోగులకు బదిలీలకు సంబంధించి ఈనెల 30వతేదీ నగరపాలక సంస్థ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అదనపు కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి, వార్డు ఎడ్యుకేషనల్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్యదర్శి, వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంటల్ కార్యదర్శి, వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శి బదిలీలకు దరఖాస్తు చేసుకున్నవారు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

రైతు సేవాకేంద్రం సిబ్బంది బదిలీలకు బ్రేక్..!

ఖరీఫ్ ఈపంట నమోదు నేపథ్యం

ఇదివరకు సచివాలయ సిబ్బందితోపాటు బదిలీలకు అవకాశం

దరఖాస్తు చేసుకున్న తర్వాత వాయిదా వేస్తూ ఉత్తర్వులు

ఎంపీఈఓలకు న్యాయం చేకూరేనా..?

అనంతపురం అర్బన్, ఆగస్టు 28: రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలకు బ్రేక్ పడింది. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఈ పంట నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలను వాయిదా వేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిబ్బందిని బదిలీ చేస్తే ఈ పంట నమోదు ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతుందని ఆందోళన చెందిన వ్యవసాయ అధికారులు బదిలీలు వాయిదా వేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో ఊరట చెందారు.

దరఖాస్తు చేసుకున్న తర్వాత వాయిదా..

జిల్లావ్యాప్తంగా 451 రైతు సేవా కేంద్రాలున్నాయి. వీటిలో 244 మంది వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. వ్యవసాయశాఖ తరఫున 128 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఉద్యానశాఖ తరఫున 108 మంది విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, పట్టుపరిశ్రమశాఖకు సంబంధించి 8 మంది విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్లు రైతు సేవా కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. మిగతా స్థానాల్లో ఎంపీఈఓలు పనిచేస్తున్నారు. ఒక్కో ఆర్బీకేలో ఒక సిబ్బందిని నియమించారు. అలాగే 410 మంది పశుసంవర్థక సహాయకులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదివరకు సచివాలయ సిబ్బందితోపాటు రైతు సేవా కేంద్రంలో పనిచేసే వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్, పశుసంవర్థక శాఖల అసిస్టెంట్లకు బదిలీల అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో ఆయా సిబ్బంది ఆన్‌లైన్‌లో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. షెడ్యూల్ మేరకు ఈనెల 24 నుంచి ఈనెల 27వతేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. బుధవారం ఆన్‌లైన్‌లోని బదిలీల దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు డౌన్‌లోడ్ చేసుకొని, గురువారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. బదిలీలపై అర్జీలు తీసుకున్న తర్వాత ఈనెల 31న బదిలీల ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉండింది. అయితే బదిలీల కౌన్సెలింగ్‌కు ఒక రోజు ముందు బుధవారం రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేయడటం గమనార్హం.

ఇప్పటికైనా న్యాయం చేకూరేనా..?

రైతు సేవా కేంద్రాల్లోని విలేజ్ అసిస్టెంట్లు చేసే విధులే నిర్వర్తిస్తున్న ఎంపీఈఓలకు ప్రభుత్వం న్యాయం చేస్తుందో..? లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా రైతు సేవా కేంద్రం సిబ్బందికి మాత్రమే బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అదే రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న ఎంపీఈఓలకు బదిలీలకు అవకాశం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో తాము పనిచేస్తున్న స్థానాల్లో రైతు సేవా కేంద్రం సిబ్బంది ఆప్షన్లు ఇస్తే తమ గతేంటని ఎంపీఈఓలు ఆందోళన చెందుతున్నారు. బదిలీలు వాయిదా పడేవరకూ తమ స్థానం ఉంటుందో..? లేదోనని ఎంపీఈఓలు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడారు. ఈ పంట నమోదు, ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ నేపథ్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలు వాయిదా వేయడంతో ఎంపీఈఓలు హమ్మయ్యా అంటూ ఊపిరిపీల్చుకున్నారు. మరోవైపు గత వైసీపీ హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న వ్యవసాయ శాఖ ఎంపీఈఓలను తిరిగి జిల్లాకు రప్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం నుంచి కమిషనర్‌కు లేఖ పంపారు. ఎంపీఈఓల సంఘం నాయకులు పలుమార్లు వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో ఓడీ రద్దు చేసి ఎంపీఈఓలను జిల్లాకు రప్పించాలని సూచించినా ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. ఇప్పటికైనా జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న సిబ్బందికి బదిలీల అవకాశం కల్పించాలని ఎంపీఈఓలు కోరుతున్నారు. ప్రస్తుతం బదిలీల గండం గడిచిందని, భవిష్యత్‌లో రైతు సేవా కేంద్రం సిబ్బందితోపాటు తమకు బదిలీలకు అవకాశం కల్పించి న్యాయం చేయాలని ఎంపీఈఓలు విజ్ఞప్తి చేస్తున్నారు. మరి ఏ మేరకు ప్రభుత్వం ఎంపీఈఓలకు న్యాయం చేస్తుందో వేచిచూడాల్సిందే.



రైతు సేవాకేంద్రం

ఐదేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్

బాగు చేసేందుకు కనీసం పదేళ్లు పడుతుంది

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



పూజల్లో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్, కార్యక్రమానికి హాజరైన పరిటాల శ్రీరామ్

విడపనకల్లు, ఆగస్టు 28: జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని, రాష్ట్రంలోని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని, వాటిని గాడిలో పెట్టడానికే కనీసం 10 సంవత్సరాల సమయం పడుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విడపనకల్లు మండలం గడేకల్లు గ్రామంలోని మారెమ్మ ఆలయంలో బుధవారం నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు అయ్యిందని, ఇచ్చిన మాట ప్రకారం వంద శాతం సామాజిక పింఛన్లను పెంచామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటలకు కట్టుబడి ఉంటుందన్నారు. ఒక్కొక్కటిగా హామీలను అమలు చేస్తుందని అన్నారు. జగన్ ఎక్కడ చూసినా అప్పులు పెట్టి పోయారని, రాష్ట్రాన్ని దివాలా తీయించారని విమర్శించారు. వాటిని తీర్చటానికే ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తూనే, హామీలను నెరవేరుస్తుందని అన్నారు. ఆరోగ్యశాఖను జగన్ అనారోగ్య శాఖగా మార్చారని, రాష్ట్రంలో 14,100 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం 13 వేల మంది ఉన్నారని అన్నారు. మిగిలిన 3100 మందిని ఐదేళ్లలో ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకనే జగన్‌మోహన్ రెడ్డి బయటకు వచ్చి అవి చేయలేదు ఇవి చేయలేదు అంటున్నారని, ఆయనది తెలివి తక్కువ తనమా..? అవగాహనా రాహిత్యమా..? లేక అహంకారమా అని ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో ప్రజలు కోల్పోయిన అభివృద్ధిని చేసి చూపిస్తామని అన్నారు. కొన్నాళ్లు ఓపిక పడితే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు.

గత వైసీపీ పాలనలో ప్రజలపై విద్యుత్ భారం: సీపీఎం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 28: రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం వివిధ పేర్లతో విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై వేలకోట్లు భారాలు మోపిందని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ విమర్శించారు. ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణల్లో భాగంగా 2000 సంవత్సరంలో పెరిగిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి సంబంధించి పోలీసుల కాల్పుల్లో మరణించిన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డిలకు బుధవారం నీలిమ సర్కిల్ వద్ద సీపీఎం నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 24 సంవత్సరాల క్రితం ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల భారాలకు వ్యతిరేకంగా వామపక్షాలు నిర్వహించిన పోరాటం రాష్ట్ర రాజకీయ చరిత్రను మార్చిందన్నారు. నాడు జరిగిన ఉద్యమ ప్రభావంతో ఆ తర్వాత 12 సంవత్సరాలకుపైగా విద్యుత్ చార్జీలు పెంచడానికి ప్రభుత్వాలు సాహసం చేయలేకపోయాయన్నారు. రైతులకు నేటికీ ఉచిత విద్యుత్ ఇవ్వడానికి నాటి ఉద్యమమే కారణమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాల్లో భాగంగా విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించేందుకు నూతన చట్టాన్ని తీసుకువస్తే, గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆ చట్టాన్ని అమలు చేస్తూ వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడం, స్మార్ట్ మీటర్ల పేరుతో అదాని కంపెనీకి వేలకోట్లు దోచిపెట్టారాన్నరు. ఈ నేపథ్యంలోనే ప్రజలు జగన్మోహన్‌రెడ్డికి ఓటుతో తగిన గుణపాఠం చెప్పి ఇంటికి సాగనంపారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, వెంకటనారాయణ, మసూద్, రాజు, లక్ష్మినారాయణ, నూరుల్లా, రామాంజనేయులు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శీన, నాగేంద్ర, పుల్లన్న, పక్కి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బదిలీల నుంచి ఆరు విభాగాలకు మినహాయింపు

అనంతపురం టౌన్, ఆగస్టు 28: ఆరు విభాగాల గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపునిచ్చారు. గతంలో అన్ని విభాగాల వారికి బదిలీలు వర్తింపుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. తాజాగా సచివాలయాల్లో పనిచేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్, అనిమల్‌హస్బెండరీ అసిస్టెంట్, విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్, ఏఎన్‌ఎంగ్రేడ్-3 వార్డుహెల్త్ అసిస్టెంట్లకు ఈ బదిలీల నుంచి మినహాయింపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఈ ఆరు విభాగాల సచివాలయాల ఉద్యోగులకు బదిలీలు ఉండవు.

రోగుల మృతిపై విచారణకు త్రిసభ్య కమిటీ

సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, ఆగస్టు 28: జిల్లా సర్వజన ఆస్పత్రిలో మంగళవారం రాత్రి ఎంఎం వార్డులో చికిత్స పొందుతున్న ఇద్దరు రోగుల మృతిపై విచారణకు కమిటీ నియమించిన ట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. తాడిపత్రికి చెందిన ఈశ్వరయ్య (38), సత్యసాయిజిల్లా ఎన్‌పీకుంటకు చెందిన నాగయ్య (40) కొన్ని గంటల వ్యవధిలో చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మంగళవారం రాత్రి మృతిచెందారు. ఇందుకు డాక్టర్లు, నర్సుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆ మరణాలపై వాస్తవ సమాచార సేకరణ కోసం ఆస్పత్రికి చెందిన సీనియర్ వైద్యులు భీమసేనాచారి, రామస్వామినాయక్, నవీన్‌కుమార్‌ను నియమించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. విచారణ అనంతరం నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

జీడిపల్లికి 910 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 28: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం 910 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే రిజర్వాయర్‌లో 1.477 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 28: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆయుష్ వైద్యశాలలో యోగా శిక్షకులుగా పనిచేసేందుకు అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ వైద్యాధికారి డాక్టర్ కిష్టయ్య తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీజీ, డిగ్రీ, డిప్లొమో ఇన్ యోగా చేసివుండాలన్నారు. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆగస్టు 30వ తేదీ ఉదయం 11 గంటలలోపు దరఖాస్తులను హనుమాన్‌కూడలిలోని ప్రభుత్వ ఆయుష్ వైద్యశాలలో అందజేయాలని సూచించారు. ఎంపికైన వారికి గంటకు రూ.250 చొప్పున వేతనం అందజేస్తారన్నారు. నెలకు 32 గంటలు పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9440304547 నంబరులో సంప్రదించాలని కోరారు.

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, ఆగస్టు 28: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం 3800 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.15, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు వివరించారు.

చీనీ కాయలు టన్ను రూ.24వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 28: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 101 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

10 టన్నులు కొనుగోలు: మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో పది టన్నుల టమోటా కొనుగోలు జరిగినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి తెలిపారు. బుధవారం కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో రూ.10తో పది టన్నులు కొనుగోలు చేసి విజయవాడకు తరలించినట్లు తెలిపారు.

జ్వరంతో విద్యార్థి మృతి



అజీమ్ (ఫైల్)

ఉరవకొండ, ఆగస్టు 28: పట్టణంలోని 1వ వార్డుకు చెందిన విద్యార్థి అజీమ్(14) జ్వరంతో బుధవారం మృతి చెందాడు. హోంగార్డు బాబాఫక్రుద్దీన్ కుమారుడు అజీమ్ మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఉరవకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించారు. అయినా తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. పుట్టినరోజు నాడే మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.


ఆర్‌బీఐ క్విజ్ పోటీలకు దరఖాస్తు చేసుకోండి



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, అధికారులు

పుట్టపర్తి, ఆగస్టు 28: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా స్థాపించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ క్విజ్‌పోటీలను నిర్వహిస్తున్నారని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. క్విజ్ పోటీల్లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న డిగ్రీ చదువుతున్న విద్యార్థులు సెప్టెంబరు 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో లీడ్‌బ్యాంకు మేనేజర్ రమణకుమార్‌తో కలిసి క్విజ్‌పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. విద్యార్థులు టీంలుగా ఏర్పడి హెచ్‌టీటీపీఎస్//డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌బీఐ90క్యూయూఐజడ్.ఐఎన్‌లో పేర్లను రిజిష్టర్ చేసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయిలో విజేతలకు ప్రథమబహుమతి రూ.2లక్షలు, ద్వితీయ బహుమతి రూ.1.50లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష ఇస్తారన్నారు. జోనల్‌స్థాయిలో ప్రథమబహుమతి రూ.5లక్షలు, ద్వితీయ బహుమతి రూ.4లక్షలు, తృతీయ బహుమతి రూ.3లక్షలు, జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి రూ.10లక్షలు, ద్వితీయ బహుమతి రూ.8లక్షలు, తృతీయ బహుమతి రూ.6లక్షలు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడండి: ఎస్ఈ



మాట్లాడుతున్న ఎస్ఈ సంపత్‌కుమార్

అనంతపురం రూరల్, ఆగస్టు 28: విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం అనంతపురం, అనంతపురం రూరల్ డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ కలెక్షన్లు సకాలంలో వసూలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను సకాలంలో వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ జేవీ రమేష్, డీఈఈలు లక్ష్మీనారాయణ, రఘు, శ్రీనివాసులు, ఏఈఈలు పాల్గొన్నారు.

అనంతకు తిరిగి పంపించండి

● చీఫ్ సెక్రటరీకి ఎంపీఈఓల సంఘం వినతి



చీఫ్ సెక్రటరీకి సమస్యలు వివరిస్తున్న ఎంపీఈఓల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 28: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న వ్యవసాయ శాఖ ఎంపీఈఓలను తిరిగి ఉమ్మడి అనంత జిల్లాకు పంపించాలని ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్‌కు ఎంపీఈఓల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం తిరుపతిలో నిర్వహించిన వికసిత్ ఆంధ్రా-2047 కార్యక్రమానికి హాజరైన ఆయనకు ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డిప్రసాద్, నాయకులు శంకర్, భాస్కర్‌నాయక్ వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో అవసరం లేకుండానే అనంత జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారన్నారు. అప్పటి నుంచి గత్యంతరంలేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతూ పనిచేస్తున్నామన్నారు. ఐదు మాసాలుగా పెండింగ్‌లోని వేతనాలు మంజూరు చేసి, తమ సర్వీస్‌ను రెన్యూవల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఆయన స్పందిస్తూ.. సచివాలయాల క్రమబద్ధీకరణ తర్వాత తక్షణమే సొంత జిల్లాలకు పంపిస్తామని హామీ ఇచ్చారు. శేషు, నాగ, గౌరి, శ్రీలక్ష్మి, కుళ్లాయమ్మ, భార్గవి, వాణి పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇప్పించండి



విజయవాడలో రామకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 28: మండలంలోని న్యామద్దల గ్రామ సమీపంలో పేదలకు ఇంటిస్థలాలు ఇప్పించి ఆదుకోవాలని పలువురు సీపీఐ నాయకులు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో భూబాధితుల సదస్సు సందర్భంగా సమస్యను రామకృష్ణను దృష్టికి తీసుకెళ్లినట్లు రాప్తాడు నియోజకవర్గకార్యదర్శిమహదేవ్, రైతుసంఘం అధ్యక్షుడు ముత్యాలప్ప తెలిపారు. గ్రామ సమీపంలో సీపీఐ కాలనీ నిర్మించడానికి 15 సంవత్సరాలుగా పేదలకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పేదలకు న్యాయం చేసే విధంగా చూడాలని కోరారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని రామకృష్ణ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ముత్యాలప్ప, రామ్మోహన్, పోలేపల్లి ముత్యాలప్ప పాల్గొన్నారు.

బాల్యవివాహాల పట్ల అప్రమత్తంగా ఉండండి

● ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 28: బాల్య వివాహాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి సూచించారు. నగరంలోని గిల్డాఫ్ సర్వీస్ స్కూల్ పక్కనున్న ఎస్సీ, బీసీ హాస్టల్ సముదాయంలో సీడీపీఓ విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లలోపు విద్యార్థినులు బాల్య వివాహాలపై అవగాహన ఉండాలన్నారు. ఎవరైనా పెళ్లిళ్లు చేయాలని చూస్తే వెంటనే తమ పాఠశాలలోని టీచర్లకు, హాస్టల్ వార్డెన్లకు సమాచారం ఇవ్వాలన్నారు. వారు వెంటనే పైస్థాయి అధికారులకు తెలియజేసి వివాహాలు అరికట్టే అవకాశం ఉందన్నారు. విద్యార్థినులు తమ జీవితంలో ఎదురయ్యే శారీరక, మానసిక సమస్యలు, గృహ హింసలకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న వాటిపై అవగాహన కల్పించారు. సఖీ సెంటర్ మేనేజర్ నర్మద, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శాంతమణి, ఐసీపీఎస్ ఉమాదేవి, వార్డెన్లు వసంత, అనిత, మాధవి పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్లను సద్వినియోగం చేసుకోండి



సబ్సిడీ డ్రిప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

గార్లదిన్నె, ఆగస్టు 28: ప్రభుత్వం సబ్సిడీతో అందించే డ్రిప్, స్ప్రింక్లర్లను సద్వినియోగం చేసుకోవాలని ప్రీమియర్ డ్రిప్ ఇరిగేషన్ నిర్వాహకులు షాషావలి, ప్రశాంత్ సూచించారు. ప్రీమియర్ డ్రిప్ ఇరిగేషన్ నిర్వాహకులు బుధవారం గార్లదిన్నె, మర్తాడు, కోటంక, బూడేడు తదితర గ్రామాల్లో పర్యటించారు. వారు మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు సరఫరా చేసేందుకు శ్రీకారం చుట్టారన్నారు. 5 ఎకరాలు ఉన్న రైతులకు 90 శాతం, 5 ఎకరాలపైన భూమి ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. నీటి సదుపాయం ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆసక్తిగల రైతులు 1బీ, ఎఫ్‌ఎంబీ స్కెచ్, చెక్కుబంది సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, బోర్‌వెల్, కరెంట్ బిల్లులతో రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9398630359 నంబరును సంప్రదించాలని తెలిపారు.

జేఎన్‌టీయూ పీఆర్వోగా ఓంప్రకాష్ బాధ్యతలు



పీఆర్వోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డైరెక్టర్లు, ప్రొఫెసర్లు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 28: జేఎన్‌టీయూ పీర్వోగా బుధవారం డాక్టర్ ఓంప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను డైరెక్టర్లు సత్యనారాయణ, నాగప్రసాద్ నాయుడు, సురేష్‌బాబు, అసోసియేట్ ప్రొఫెసర్లు జితేంద్రగౌడ్, శ్రీధర్, అంకారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, పలువురు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

పరీక్షల ప్రక్రియను వేగవంతం చేయండి




ఫైళ్లను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ రమేష్‌బాబు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 28: పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతంచేసి సకాలంలో ఫలితాల విడుదలచేసి, సర్టిఫికెట్స్ జారీచేయాలని ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం పరీక్షల నిర్వహణ కేంద్రాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. మూల్యాంకనం, సర్టిఫికెట్లజారీ, కంప్యూటర్ సెక్షన్ తదితర విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల అలసత్వం విద్యార్థులపై ప్రభావం చూపుతోందన్నారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి విద్యార్థులకు సమస్యలేకుండా చూడాలన్నారు. వారంలో మూడు రోజులు కేంద్రాన్ని సందర్శిస్తానని గతంలోలాగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. డీఈ ప్రొఫెసర్ జీవీ రమణ, ఈసీ డాక్టర్ లోకేష్ పాల్గొన్నారు.

రక్షణ గోడల ఏర్పాటుకు నిధులివ్వండి

● మంత్రి నిమ్మలకు ఎమ్మెల్యే దగ్గుపాటి వినతి



మంత్రి రామానాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, ఆగస్టు 28: అనంతపురం నగరంలో నడిమి, మరువ వంకలకు రక్షణ గోడల ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కోరారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో కలిసి దగ్గుపాటి మంత్రికి వినతి పత్రం అందజేశారు. అనంతపురం నగరంతోపాటు రాప్తాడు నియోజకవర్గంలో భారీ వర్షాలు పడిన సమయంలో నడిమి, మరువ వంకలకు పెద్ద ఎత్తున నీరు వస్తోందని మంత్రికి వివరించారు. తద్వారా వంకల్లోని నీరు పరిసర ప్రాంతాల్లోని కాలనీల్లోకి వెళ్లడంతో ఇళ్లు నీటమునుగుతున్నాయన్నారు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికే ఇలాంటి పరిస్థితి ఇటీవల రెండు సార్లు జరిగాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రెండు కాలువల వెంబడి ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణం కోసం రూ.124.02 కోట్లు అవసరం అవుతుందన్నారు. ఈ మొత్తాన్ని మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

మంత్రి సవితతో ఎమ్మెల్యే భేటీ: బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతో ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు భేటీ అయ్యారు. బుధవారం అమరావతిలో ఏపీ సచివాలయం నాలుగో బ్లాక్‌లో మంత్రి పేషీలో ఆమెను ఎమ్మెల్యేలు కలిసి పలు అంశాలపై చర్చించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నియోకవర్గాల్లో పలు ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై మంత్రి దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చుతున్న డీఈఓ

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 28: డీఈఓ వరలక్ష్మి ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు అక్కులప్ప బుధవారం ప్రకటనలో మండిపడ్డారు. విద్యాశాఖలోని దళిత, బలహీన వర్గాలకు చెందిన అధికారులు, ఉపాధ్యాయులను గత వైసీపీ ప్రభుత్వం హీనాతిహీనంగా చూసిందని, కూటమి ప్రభుత్వం వారి హక్కులను పరిరక్షించే చర్యలు తీసుకుంటున్న వేళ డీఈఓ ఇందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్నారు. హెడ్‌మాస్టర్, ఎంఈఓ, సమగ్ర శిక్ష సెక్టోరియల్ వంటి పదవులను ఐదేళ్లుగా వైసీపీ నేతలు వారి అనుయాయులకు కట్టబెట్టారన్నారు. అర్హత, అనుభవమున్న దళిత, బలహీన వర్గాలవారిని అప్రధాన్యంగా పక్కన పెట్టారన్నారు. ప్రభుత్వం మారినా అదేతీరు కొనసాగిస్తున్న డీఈఓపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశామన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 28: అంబేడ్కర్ గురుకుల పాఠశాలల అడ్మిషన్ల ప్రక్రియలో అవినీతికి పాల్పడిన డీసీఓను సస్పెండ్ చేయాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ముట్టడి చేపడుతున్నట్లు ప్రజా దళిత విద్యార్థి సంఘాల నాయకులు మధుప్రసాద్, మద్దెలచెరువు వెంకీ, రాళ్లపల్లి చంద్రశేఖర్, లక్ష్మణ్, మందల రమేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రజా, దళిత, విద్యార్థి సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

హాస్టళ్ల సమస్యలపై..: జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం దీక్షలు చేపడుతున్నట్లు ఆ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. దీక్షలకు ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు పాల్గొంటున్నారన్నారు. జిల్లాలోని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఎస్‌వీఐటీ విద్యార్థుల ప్రతిభ

రాప్తాడు, ఆగస్టు 28: మండలంలోని హంపాపురం సమీపాన ఉన్న ఎస్‌వీఐటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మోంగోడిబి సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ఎండీ వెన్నపూస రమాకాంత్‌రెడ్డి తెలిపారు. కళాశాలలోని 200 మంది విద్యార్థులు మోంగోడిబి సర్టిఫికేషన్‌లో విజయం సాధించారన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి రవికిషోర్, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.

అర్చకుల వేతనాల పెంపు హర్షణీయం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 28: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్దికాలంలోనే అర్చకుల వేతనాలను రూ.15వేలకు పెంచుతూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి అనంతకుమారి, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ నరేష్ బుధవారం సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. ధూపదీప నైవేద్యాలకు చెల్లిస్తున్న రూ.5వేలను రూ.10వేలకు పెంచడంతోపాటు నిరుద్యోగ వేద విద్యార్థులకు నెలకు రూ.3వేలు చొప్పున భృతి ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తీసుకున్న అభివృద్ధి చర్యలతో బ్రాహ్మణ జాతి అభివృద్ధికి తోడ్పడుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వేతనం పెంపు...

అనంతపురం అర్బన్, ఆగస్టు 28: రాష్ట్రంలోని దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణ క్షౌరవృత్తిదారులకు రూ.25వేలు వేతనాన్ని ప్రభుత్వం పెంచడం హర్షణీయమని టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు కడియాల కొండన్న ప్రకటనలో అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల హామీ మేరకు వేతనాన్ని పెంచి మాట నిలుపుకున్నారు. ఆలయ కమిటీ బోర్డు సభ్యుల్లో నాయీబ్రాహ్మణుడిని నియమించేలా నిర్ణయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాయీబ్రాహ్మణుల సంక్షేమం ఎన్డీఏ కూటమితోనే సాధ్యమవుతుందన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం: సీడీపీఓ

శింగనమల, ఆగస్టు 28: పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటూన్నారని సీడీపీఓ ఉమాశంకరమ్మ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా ఆరోగ్య సంరక్షణ ఐఎఫ్‌ఏ మాత్రలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందజేస్తారన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. సుపర్‌వైజర్లు ధనలక్ష్మి, కౌసల్య, ఉమాదేవి, హైమలత, వాణిశ్రీ, నగమణి, అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనవసర మందులను పిచికారీ చేయవద్దు

శింగనమల, ఆగస్టు 28: మండలంలోని రైతులు పంటలకు అనవసర మందులు పిచికారీ చేయవద్దని మండల వ్యవసాయధికారి అన్వేష్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని సోదనపల్లి గ్రామంలో రైతులతో పొలంబడి కార్యాక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు అనవసర మందులు పిచికారి మానుకోవాలని తక్కువగా మందులు పిచికారి చేసి ఆహార ఉత్పత్తులు చేయాలన్నారు. రైతులు పండించిన పంటలను ఎఫ్‌పీఓ గుత్తి వారు కొనుగోలు చేస్తారన్నారు. కార్యకరమంలో ఏఈఓ అక్కమ్మ, రాజారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా ప్రభుకుమార్



బుక్కరాయసముద్రం, ఆగస్టు 28: అనంతపురం ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్‌గా కె. ప్రభుకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొంత కాలంగా జంతులూరు ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ స్థానం ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే. కర్నూలు-2 బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్‌గా పనిచేస్తున్న ప్రభుకుమార్ పదోన్నతిపై కమాండెంట్‌గా ప్రభుత్వం నియమించింది. బెటాలియన్‌లో సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆయన వెల్లడించారు. బెటాలియన్‌లో రానున్న మూడు సంవత్సరాలలో సిబ్బంది క్వార్టర్స్ మౌలిక సదుపాయల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించనున్నట్లు తెలిపారు.

సీఐగా శ్రీధర్ బాధ్యతలు

బుక్కరాయసముద్రం, ఆగస్టు 28: బుక్కరాయసముద్రం అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐగా శ్రీధర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ వెంకటేశ్వర్లు బదలీ అయిన విషయం తెలిసిందే. ఈయన స్థానంలో శింగనమల సర్కిల్ సీఐ శ్రీధర్‌ను ఇక్కడకు బదలీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడైనా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కులం పేరుతో దూషిస్తూ దాడి

● పోలీసులకు బాధితుల ఫిర్యాదు



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 28: మండలంలోని వెంకటంపల్లి గ్రామంలో తమను కులం పేరుతో దూషిస్తూ అకారణంగా దాడిచేసి గాయపరిచారని బాధితులు బుధవారం ఎస్ఐ వెంకటేశ్వర్లును కలిసి ఫిర్యాదుచేశారు. 25వ తేదీన గ్రామానికి చెందిన చీమల రామలింగప్ప, ఆయన భార్య అక్కమ్మ, వీరా, కుళ్లాయి, వెంకటరెడ్డి తమ ఇంటిపైకి దౌర్జన్యంగా వచ్చి దాడిచేశారని రాజు, అతని భార్య ఇందిరా తల్లి వారాదమ్మ ఫిర్యాదుచేశారు. ఇంటిపైకి వచ్చి మీ భర్త ఎక్కడున్నాడని, వాడి అంతుచూస్తామని బెదిరింపులకు దిగారన్నారు. భర్త ఇంటి వద్దకు రాగానే ఒక్కసారిగా ఇనుప రాడ్డుతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారన్నారు. తీవ్రగాయాలతో అనంతపురంలో చికిత్సలు చేయించుకున్న అనంతరం నాలుగురోజుల తరువాత ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరితో కలిసి బాధితులు ఎస్ఐకి ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అనంతపురం క్రైం, ఆగస్టు 28: తీవ్ర తలనొప్పితో బాధపడుతూ ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అనంతపురం నగర శివారులోని పాపం పేటకు చెందిన రమేష్(19) మైగ్రేన్ తలనొప్పితో బాధపడేవాడు. ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. తలనొప్పి తగ్గే మార్గం కనిపించకపోవడంతో 26వ తేదీన విషద్రావకం తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్య, వైజ్ఞానిక తరగతులను జయప్రదం చేయండి

రాప్తాడు, ఆగస్టు 28: అనంతపురంలో సెప్టెంబరు 2 నుంచి జరిగే విద్యా, వైజ్ఞానిక తరగతులను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. రాప్తాడు ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ మల్లికార్జున చేత బుధవారం పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్రప్రసాద్, టౌన్ అధ్యక్షుడు శంకర్, యూనివర్సిటీ నాయకులు తేజ, నరేష్ పాల్గొన్నారు.

బిచ్చమెత్తుకుంటూ తాగునీటి కార్మికుల నిరసన



కల్లూరులో నిరసన వ్యక్తం చేస్తున్న తాగునీటి పథకం కార్మికులు

గార్లదిన్నె, ఆగస్టు 28: సమస్యలు పరిష్కారించాలని సత్యసాయి తాగునీటి కార్మికుల గతవారం రోజుల నుంచి నిరసనలు కొనసాగిస్తున్నారు. కల్లూరు పంపుహౌస్ వద్ద బుధవారం సత్యసాయి బాబా చిత్రపటాన్ని ముందు పెట్టుకుని బిచ్చమెత్తుకుంటూ వినూత్న నిరసన తెలిపారు. తాగునీటి పథకం ద్వారా లక్షలాది మంది ప్రజలకు తాగునీరు అందించడంతో పాటు వందలాది మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారని కార్మికులు తెలిపారు. 6 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. సమస్యలను పరిష్కారించాలని వేడుకున్నారు. కార్మికులు నాగభూషణం, మల్లరాయుడు, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, సాంబశివ, జనార్ధన్‌రెడ్డి, శంకర్, బాషా పాల్గొన్నారు.

నార్పల: సత్యసాయి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని బీ పప్పూరు పంప్ హౌస్ వద్ద చేపట్టిన సమ్మె బుధవారం ఏడో రోజుకుచేరింది. పంప్ హౌస్ వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు నాగభూషన్, అంకన్న, పుల్లనాయుడు, శరత్‌బాబు, శ్రీరాములు, చంద్రమోహన్, ధనుంజయ పాల్గొన్నారు.

అధ్యాపకులు నిత్య పరిశోధకులు: వీసీ

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 28: అధ్యాపకులు నిత్య పరిశోధకులుగా కొత్త అంశాలను ఎప్పటికప్పుడు శోధించాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు సూచించారు. బుధవారం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ సెమినార్ హాల్లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఎఫ్‌డీపీకి వీసీ సుదర్శనరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యావ్యవస్థలో టీచింగ్ ఫ్యాకల్టీ కీలకమన్నారు. వారి విజ్ఞానాన్ని, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు బోధించి నూతన ఇంజనీర్లుగా తీర్చిదిద్దేలా అప్‌డేట్ కావాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, ఎఫ్‌డీపీ డైరెక్టర్ ప్రశాంతి, డీఈ నాగప్రసాద్ నాయుడు, ప్రొఫెసర్‌లు దుర్గాప్రసాద్, చంద్రమోహన్‌రెడ్డి, శివకుమార్, హేమచంద్రారెడ్డి, విభాగాధిపతులు అజిత, రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ సుదర్శన రావు

విద్యార్థుల నైపుణ్యాలు వెలికితీసేలా ప్రత్యేక క్లబ్‌లు: విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలు వెలికితీసేందుకు ప్రత్యేక క్లబ్‌లు ఏర్పాటుచేశామని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు అన్నారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం స్టూడెంట్ క్లబ్ సావనీర్ ఆవిష్కరణ సభను నిర్వహించారు. కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల అధ్యక్షతన నిర్వహించిన సభను వీసీ, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర జ్యోతిప్రజ్వలనచేసి ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ కమ్యూనికేషన్, ఇన్నోవేటివ్, టెక్నికల్, సాఫ్ట్, కోడింగ్, వెల్‌నెస్, లీడర్‌షిప్, ఫొటోగ్రఫీ తదితర అంశాలపై 12రకాల క్లబ్‌ల ద్వారా వాటిపై శిక్షణ ఇస్తారన్నారు.

వైభవంగా మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో అమ్మవారు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 28: స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని వలీ స్వామి ఆశ్రమ ఆవరణలో ఉన్న కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు భక్తుల చేతులమీదుగా క్షీరాభిషేకం చేయించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఫలపంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం ఆలయ ఆవరణలో 216 ముత్తైదువులకు సామూహికంగా ఒడి బియ్యం సమర్పించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. విద్యానృసింహ భారతి స్వామి, నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి, రవికాంత్ రమణ, ఆలయ కమిటీ సభ్యులు శ్రీధర్ తేజ, కొండారెడ్డి, చంద్రశేఖర్‌బాబు, రాంభూపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, కేవీఎస్ చలపతిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణుడి పల్లకి సేవ



స్వామివారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 28: ప్రబోధా సేవాసమితి, ఇందుజ్ఞానవేదిక ఆధ్వర్యంలో చెన్నేకొత్తపల్లిలో బుధవారం శ్రీకృష్ణుడి పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలలో భాగంగా స్వామివారి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో గ్రామపురవీధులగుండా ఊరేగించారు. స్థానికులే కాకుండా పలు ప్రాంతాల నుంచి వచ్చిన సభ్యులు ఊరేగింపులో పాల్గొన్నారు.

కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 28: మండల కేంద్రంలో వెలసిన గ్రామ దేవత కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ఠ పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులు విగ్రహప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా గణపతి, నవగ్రహ పూజలతోపాటు పలు హోమాలను వేదపండితులు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ పనితీరుపై అసిస్టెంట్ కలెక్టర్ ఆరా



వ్యవసాయ శాఖ కార్యాలయ బోర్డులోని వివరాలపై ఆరా తీస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం అర్బన్, ఆగస్టు 28: వ్యవసాయ శాఖ పనితీరుపై అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న ఆరా తీశారు. బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ పరంగా రైతులకు చేస్తున్న పనులు, అమలు చేస్తున్న పథకాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించేలా ప్రత్యేక చొరవ చూపాలని ఆమె సూచించారు. టెక్నికల్ ఏఓలు వెంకట్‌కుమార్, రాకేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీలను నిలిపివేయాలి

అనంతపురం క్రైం, ఆగస్టు 28: పన్నుల శాఖలో బదిలీలు వెంటనే నిలిపివేయాలని ఆ శాఖ ఎన్జీఓ సంఘం అనంతపురం డివిజన్ అధ్యక్షుడు జ్యోతిరాం డిమాండ్ చేశారు. బుధవారం ఆ శాఖ కార్యాలయంలో మధ్యాహ్నం సమయంలో గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ 2.0 రీఆర్గనైజేషన్ పేరుతో జరిగిన అన్యాయాలు, పూర్వపు బదిలీలపై పునఃసమీక్ష చేయాలని, ఆర్‌ఓ ఆఫీలను రద్దు చేయాలని కోరారు. సమస్యలన్నీ పరిష్కరించాకే బదిలీలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి, గిరిధర్, ఫయాజ్ పాల్గొన్నారు.

దులీప్ ట్రోఫీ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 28: దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీల ఏర్పాట్లను ఎస్పీ జగదీష్ పరిశీలించారు. బీసీసీఐ ఆధ్వర్యంలో అనంత క్రీడా గ్రామంలో సెప్టెంబరు 5 నుంచి నిర్వహించే క్రికెట్ పోటీల భద్రతా ఏర్పాట్లను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌తో కలిసి బుధవారం సాయంత్రం ఎస్పీ పరిశీలించారు. భారత దిగ్గజ ఆటగాళ్లు పాల్గొంటున్న క్రికెట్ పోటీలకు అదేస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పోలీసు శాఖ జిల్లా యంత్రాంగంతో కలిసి చేపడుతోందని ఎస్పీ తెలిపారు. మాంఛో ఫెర్రర్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి చర్చించారు. పోటీల్లో ఎలాంటి భద్రతాపరమైన లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు మేనేజర్ ఆదిత్యవర్మ, రాప్తాడు సీఐ శ్రీహర్ష, దులీప్‌ట్రోఫీ కార్యనిర్వాహక కార్యదర్శి షాబుద్దీన్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి మధు ఆచారి పాల్గొన్నారు.

వివాహాలకు ముంటిమడుగు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కేశవరెడ్డి

గార్లదిన్నె, ఆగస్టు 28: మండలంలోని ముకుందాపురం, కేశాపురం గ్రామాలకు చెందిన ఇరువురు పేదల వివాహాలకు టూమెన్ కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి రూ.20వేలు ఆర్థికసాయం అందచేశారు. టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షులు ఆవులక్రిష్ణయ్య, మాజీ కన్వీనర్లు గోరకాటి వెంకటేసు, జయరాం, చితంబరప్ప, నరసింహారెడ్డి, ఆంజనేయులు, గుత్తా లక్ష్మీనారాయణ, నల్లప్ప, మల్లికార్జున, రామచంద్ర పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ పోరాటాల ఫలితమే పింఛన్ల పెంపు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 28: వీహెచ్‌పీఎస్ దశాబ్దాల పోరాటాల ఫలితంగా దివ్యాంగుల పింఛన్ల పెంపు అని ఈ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న అన్నారు. బుధవారం వీహెచ్‌పీఎస్ 18వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహంవద్ద కేక్‌ను కట్‌చేసి సంబరాలు చేసుకుతన్నారు. అనంతరం పెద్దన్న మాట్లాడుతూ వైకల్యం బారిన పడిన వారిపట్ల సమాజం అగౌరవంగా చూడకూడదన్నారు. వారి హక్కులను పరిరక్షించేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వీహెచ్‌పీఎస్‌ను ఏర్పాటుచేశారన్నారు. స్వామిట్ మధు, స్వతంత్రకుమారి, జయమ్మ, వరాలమ్మ, హుస్సేన్‌బీ, రేకలకుంట రామాంజనేయులు, జానకీరాముడు, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

రైతు సేవాకేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోండి

గుత్తి, ఆగస్టు28: ప్రత్యామ్నాయ విత్తనాల కోసం మండల రైతులు ఆయా రైతు సేవా కేంద్రాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఇన్‌చార్జి ఏఈఓ మెహారున్నీసా బేగం బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీతో ఉలవలు, జొన్నలు అందజేయనుందన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, ఆగస్టు 28: పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన వృద్ధుడు ముల్లాషేక్ మహమ్మద్ రఫీ(60) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ముల్లాషేక్ మహమ్మద్ రఫీ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధ భరించలేక తెల్లవారుజామున ఇంట్లో విషద్రావకం తాగి ఆత్మహత్యాకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య రసూల్‌బీ, ముగ్గురు కుమారులు, ఒక కూమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వన్‌టౌన్ సీఐగా మనోహర్ బాధ్యతలు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 28: పట్టణంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నూతన సీఐగా మనోహర్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రామసుబ్బయ్యను వీఆర్‌కు బదిలీ చేశారు. మడకశిరలో పనిచేస్తున్న మనోహర్‌ను వన్‌టౌన్‌కు బదిలీ చేశారు.

పట్టణ సీఐగా సాయిప్రసాద్..

తాడిపత్రి, ఆగస్టు28: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నూతన సీఐగా సాయిప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో పనిచేస్తున్న నాగేంద్రప్రసాద్ బదిలీపై ధర్మవరానికి వెళ్లారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో పనిచేస్తున్న సాయిప్రసాద్ తాడిపత్రికి వచ్చారు. నూతన సీఐకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కణేకల్లు/రాయదుర్గం, ఆగస్టు 28: కణేకల్లు, రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అతిథి లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆంజనేయులు, వీరేష్ బుధవారం ప్రకటనలో కోరారు. కణేకల్లు కళాశాలలో జువాలజీ సబ్జెక్టును బోధించేందుకు ఈనెల 31వ తేదీలోపు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాయదుర్గం జూనియర్ కళాశాలలో ఒకేషనల్ గ్రూప్‌లో అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ పోస్టు ఖాళీగా ఉందని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

డ్రైవర్లపై కేసు నమోదు

తాడిపత్రి, ఆగస్టు 28: రెండురోజులక్రితం మండలంలోని ఆలూరు, వీరాపురం, సజ్జలదిన్నె గ్రామాల సరిహద్దులోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ల డ్రైవర్లు నవీన్, ఈశ్వర్‌పై బుధవారం కేసు నమోదు చేశామని రూరల్ పోలీసులు తెలిపారు. అదేవిధంగా ఇసుక టిప్పర్లను అడ్డుకున్న టీడీపీ మద్దతుదారులైన రామ్మోహన్, యాసీన్, గురుమూర్తిలపై దాడిచేసిన ఘటనలో రామ్మోహన్ ఫిర్యాదుమేరకు మల్లేశ్వరరెడ్డి, కల్యాణ్, మారుతిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసినట్లు చెప్పారు. అదేవిధంగా మంగళవారం పట్టణంలోని యల్లనూరురహదారిలో ఉన్న ద్వారకావిల్లాస్‌పై కొందరు వ్యక్తులు దాడిచేయగా వారిపై కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఊరేగింపులో మహిళలపై దాడి

రాయదుర్గంరూరల్, ఆగస్టు 28: మండలంలోని చదంగొల్లలదొడ్డి గ్రామంలో మంగళవారం రాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఊరేగింపులో వైసీపీ మాజీ సర్పంచ్ ఎర్రప్ప వర్గీయులు దాడి చేసినట్లు మహిళలు లక్ష్మక్క, చౌడేశ్వరి పేర్కొన్నారు. ఈవిషయంపై ఏఎస్‌ఐ భాస్కర్‌కు బుధవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలలో భాగంగా ఊరేగింపు నిర్వహిస్తుండగా వైసీపీ మాజీ సర్పంచ్ ఎర్రప్ప ఇంటి సమీపంలోని కమిటీ హాల్ వద్ద ఎర్రప్ప వర్గీయులు గోవర్ధన్, నాగప్ప, నగేష్, శాంతి, తిమ్మన్న, పశుపతి తదితరులు ఊరేగింపు మా ఏరియాకు రాకూడదంటూ వాదనకు దిగారన్నారు. దేవుని కార్యం చేస్తున్నామని చెప్పినప్పటికీ వినకుండా ఈ ఏరియాకు మీరు రాకూడదంటూ కర్రలు తీసుకొని దాడిచేసినట్లు చెప్పారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దళితులకు న్యాయం చేయండి

బొమ్మనహాళ్, ఆగస్టు 28: మండలంలోని ఏళంజి గ్రామంలో దళితులకు ఇళ్ల పట్టాలు గత ప్రభుత్వంలో మంజూరయ్యాయని, ఇప్పుడు వారు ఇళ్లు నిర్మించుకునేందుకు వెళితే గ్రామానికి చెందిన మహ్మద్‌బాషా అనే వ్యక్తి అడ్డు తగులుతున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సంఘం నాయకుడు సాకే రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట బుధవారం బాధిత దళితులతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో దళితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని, ఇల్లు లేని వారు గృహాలు నిర్మించుకునేందుకు ఆ స్థలాల వద్దకు వెళితే మహ్మద్‌బాషా బెదిరిస్తున్నాడని వాపోయారు. దీంతో రెవెన్యూ అధికారులు దళితులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందించారు.

రెండు ఇళ్లలో చోరీ

గుంతకల్లుటౌన్, ఆగస్టు 28: పట్టణంలోని రెండు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక హంపయ్య కాలనీలో నివాసముంటున్న విశ్రాంత ఉద్యోగి వన్నూరప్ప ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. వన్నూరప్ప, అతడి భార్య లలిత ఇంటికి తాళం వేసి ఈ నెల 20వ తేదీన పట్టణంలోని బెంచికొట్టాలలో నివాసముంటున్న కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న మూడున్నర తులాల బంగారు నగలు, చిన్నపాటి వెండి వస్తువులు, రూ.90వేల నగదు ఎత్తుకెళారు. ఈ విషయంపై బాధితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే పట్టణంలోని అంజలి నగర్‌లో నివాసముంటున్న బేల్దారి సురేష్ ఇంట్లో బుధవారం సాయంత్రం చోరీ జరిగింది. ఉదయం సురేష్, అతడి తల్లి ఇంటికి తాళం వేసి బేల్దారి పనికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని గుర్తించారు. బీరువా లో ఉన్న మూడు గ్రాముల బంగారు నగలు, పది తులాల వెండి వస్తువులు, రూ.60 వేల నగదు ఎత్తు కెళ్లారని బాధితుడు తెలిపాడు. ఈ విషయమై కసాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కసాపురం పోలీసులు తెలిపారు.

ఆమోదించిన తీర్మానాలను నెరవేర్చేదెన్నడు?

● కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ల నిలదీత



గుంతకల్లులో మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

గుంతకల్లు, ఆగస్టు 28: మున్సిపాలిటీ కౌన్సిల్‌లో మెజారిటీ ఉందికదా అని అజెండా కాపీని చదవకుండానే తీర్మానాలకు ఆమోదం తెలిపారేగానీ వాటిని నెరవేర్చింది శూన్యమని టీడీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో గల సమావేశ భవనంలో బుధవారం ఉదయం సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పవన్‌కుమార్ గౌడ్, కృపాకర్ తదితరులు మాట్లాడుతూ.. ఎన్నో పనులను కేటాయిస్తూ జోరుగా తీర్మానాలు చేసి, వాటిని తుంగలో తొక్కారని, ఆ తీర్మానాలు ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని చైర్‌పర్సన్ ఎన్ భవానిని ప్రశ్నించారు. పట్టణంలో తాగునీరు నాలుగైదు రోజులకు ఒకసారి వదలుతున్నారని, ఆ సమస్య ఎప్పుడు పరిష్కారమౌతుందని నిలదీశారు. ధర్మవరం గేటు వద్ద ఉన్న ఆర్‌యూబీ గుండా గతంలో ఆటోలు వెళ్లేవని, ఇప్పుడు అలా వెళ్లకుండా అడ్డంకులు ఏర్పరిచారన్నారు. యథాతథంగా ఆటోలు వెళ్లేలా చేస్తే గేటుపడినప్పుడు ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. కసాపురం రోడ్డు గుంతల మయంగా ఉందని, సమస్య పరిష్కారానికి ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించాలని అన్నారు. సమావేశంలో కమిషనరు వెంకట రమణయ్య, టీడీపీ కౌన్సిలర్లు కేసీ అనూరాధ, గుడిపాటి ఆంజనేయులు, షరీపుద్దీన్, ప్రభాకర్, వై సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం..

తాడిపత్రి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వైస్‌చైర్మన్ అబ్దుల్‌రహీం ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో సీనియర్ అసిస్టెంట్ నాగరాజు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. వీటిలో అమృత్ పథకం కింద రూ.61.80కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులను పాత, కొత్త పైప్‌లైన్ నిర్మాణాలు, మరమ్మతుల కోసం వినియోగిస్తామన్నారు. పట్టణంలో అండర్‌డ్రైనేజీ నిర్వహణ కోసం రూ.80.76లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసే పారిశుధ్య కార్మికులకు రూ.21వేలు వేతనం పెంచినట్లు చెప్పారు. వీటితోపాటు మరిన్ని ప్రతిపాదనలు ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశంలో కమిషనర్ శివరామకృష్ణ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మాల్యంలో ఎల్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ

● దర్శించుకున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, ఆగస్టు 28: మండలంలోని మాల్యం గ్రామంలో బుధవారం ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు రెండురోజులుగా ప్రత్యేక హోమాలు, పూజలు జరిపారు. తర్వాత విగ్రహాన్ని వేదమంత్రోచ్ఛారణల నడుమ పునఃప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించారు. తొలుత ఆయనకు గ్రామపెద్దలు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తర్వాత స్థానిక బోయ కాలనీలో వాల్మీకి విగ్రహ ఏర్పాటు చేయనున్నామని ఆ కాలనీ వాసులు ఎమ్మెల్యేకు తెలిపారు. స్పందించిన ఆయన రూ. 75 వేల ఆర్థిక సహాయాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట నాయకులు యువరాజ్‌గౌడ్, శరభనగౌడ్, అశోక్, ప్రభాకర్, విజయ్‌కుమార్, చంద్రశేఖర్‌గౌడ్, కృష్ణారెడ్డి, కురుబ నరేష్, సూరి, హరి, ఎల్లప్ప ఉన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

మండల కేంద్రంలోని ఉరవకొండ రోడ్డులో ఉన్న యువరాజ్ అనే టీడీపీ నాయకుడిని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పరామర్శించారు. యువరాజ్ ఇటీవల గుండెకు సంబంధించిన చికిత్స తీసుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కాలవ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ద్వారకా విల్లాస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే



విల్లాస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్ రెడ్డి

తాడిపత్రి, ఆగస్టు 28: పట్టణంలోని యల్లనూరురోడ్డులో ఉన్న ద్వారకా విల్లాస్‌ను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. రెండురోజులక్రితం కొందరు విల్లాపై రాళ్ల దాడి చేయడంతో సీసీ కెమెరాలు, కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. దీంతో ఎమ్మెల్యే ధ్వంసమైన వస్తువులను పరిశీలించారు. సొంత ఖర్చులతో మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. అనంతరం విల్లాలో కలియతిరిగి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఎవరూ భయపడాల్సిన పనిలేదని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తాను ఉన్నానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మల్లేశ్వరరెడ్డి, మధు, ఖాదర్, రంగనాథ, నాయుడు, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించండి

పామిడి, ఆగస్టు 28 : ప్రతిరోజూ తాగునీటి సరఫరాకు అహర్నిశలు కృషి చేస్తున్న తమకు వేతనాలు చెల్లించాలని కోరుతూ.. సత్యసాయి తాగునీటి పథకం ప్రాజెక్టు సిబ్బంది పట్టణంలోని పంప్‌హౌస్ వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందన్నారు. ఆరవ నెలకూడా పూర్తవుతోందని, అయినా జీతాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

తాడిపత్రి, ఆగస్టు 28: భవన నిర్మాణ కార్మికులను వెల్ఫేర్ బోర్డు ద్వారా ప్రభుత్వం ఆదుకోవాలని పట్టణంలోని లేబర్ కార్యాలయం వద్ద బుధవారం సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ సెస్ నిధులపై ప్రభుత్వాల పెత్తనం ఉండరాదన్నారు. గత ప్రభుత్వం బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు నిధులను వైఎస్ఆర్ బీమాకి రూ.380కోట్లు, మిగులు నిధుల పేరుతో జీఓ నెంబరు 17ను ప్రవేశపెట్టి పవర్ ఫైనాన్స్ ద్వారా రూ.450కోట్లను దారి మళ్లించారన్నారు. కార్మికులకు రావాల్సిన క్లైంలను తీసుకోకుండా నిలిపి వేశారన్నారు. కరోనా కష్టకాలంలో ఉపాధిలేక కార్మికులు పడరానిపాట్లు పడ్డారని తెలిపారు. కార్మికులకు గుర్తింపు కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అనంతరం కార్మికశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. నిరసనలో నాయకులు శ్రీనివాసయాదవ్, రమణ, రవికుమార్, కృష్ణనాయక్, గోవిందనాయక్, వెంకటేష్‌నాయక్, శ్రీరాములు, అబ్రహం పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యాడికి, ఆగస్టు 28: ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. తాడిపత్రి మండలం ఇగుడూరు గ్రామానికి చెందిన నగేష్ ట్రాక్టర్‌లో ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా యాడికి మండలం వేములపాడు గ్రామం వద్ద దాడిచేసి పట్టుకున్నట్లు చెప్పారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. నగేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బీబీ జైనబ్బీ దర్గా ఉరుసు ప్రారంభం

ఉరవకొండ, ఆగస్టు 28: పట్టణంలోని బీబీజైనబ్బీ దర్గా ఉరుసు ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్గాలో అమ్మవారి సమాధిని వివిధ పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉరుసులో భాగంగా గంధం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అల్లపరెడ్డి ఇంటి నుంచి గంధను తెల్లవారుజామున మేళతాళాల మధ్య పట్టణంలోని వీధుల గుండా ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. కమిటీ సభ్యులు హోతూరు బాషా, బ్యాళ్ల ప్రసాద్, జిలాన్, జాకీర్ పాల్గొన్నారు.

పోలీసు బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

తాడిపత్రి, ఆగస్టు 28: పట్టణంలో వరుసగా జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని బుధవారం పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లా నుంచి సీబీరోడ్డు మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు కవాతు నిర్వహించారు. అంతకుమునుపు అడిషనల్ ఎస్పీ రమణమూర్తి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించారు. పట్టణంలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు చెప్పాలని తెలిపారు. కవాతులో సీఐ సాయినాథ్, ఎస్ఐ కాటమయ్య, సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

ఘనంగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

● పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అమిలినేని

కుందుర్పి, ఆగస్టు 28: మండల కేంద్రంలో బుధ వారం దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు హాజరయ్యారు. గ్రామస్థులు ఆయనకు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. దుర్గమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకుని పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేదపండితులు ఉదయం బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను గావించారు. అలాగే వేద మంత్రాల నడుమ హోమాలు, బలిహరణము, పూర్ణాహుతి, కుంభాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మేనల్లుడు ధర్మతేజ, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలి..

కళ్యాణదుర్గం (కంబదూరు): కంబదూరు మండలం జక్కిరెడ్డిపల్లిలో బుధవారం జరిగిన కృష్ణాష్టమి ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తొలుత శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో చిన్నారుల నృత్యాలను తిలకించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని, దైవచింతతను కలిగి ఉండాలని సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్‌చౌదరి, మాజీ ఎంపీపీ అమిలినేని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య వైద్యులపై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గం రూరల్, ఆగస్టు 28: కణేకల్లు మండలం ఎర్రగుంట్ల ప్రభుత్వాసుపత్రిలో వైద్యుడు విజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ తాలూకా కార్యదర్శి కొట్రేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాయదుర్గం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటరమణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యర్రగుంట్ల ప్రభుత్వాసుపత్రి లో రెండురోజుల క్రితం వైద్యులు సరైన సమయంలో వైద్యం అందించకపోవంతో బాలిక మృతి చెందిందన్నారు. అలాగే ఇటీవల గుమ్మఘట్ట మండలం గోనబావికి చెందిన వృద్ధుడు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రిలో సెక్యూరిటీ గార్డుతో వైద్యం అందించడంతో మృతిచెందాడన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆయా వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ రైతు సంఘం నాయకులు తిప్పేస్వామి, నరసింహులు, దుర్గన్న, పార్వతి పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంక్‌లో కంపోనెంట్స్ ఏర్పాటు చేయాలని వినతి

గుంతకల్లు టౌన్/విడపనకల్లు, ఆగస్టు 28: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గల బ్లడ్ బ్యాంక్‌లో కంపోనెంట్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్‌కు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ తదితరులు వినతి పత్రం అందజేశారు. విడపనకల్లు మండలం గడేకల్లు గ్రామానికి విచ్చేసిన మంత్రిని వారు కలిసి మాట్లాడారు. బ్లడ్ బ్యాంక్‌లో కేవలం హోల్ బ్లడ్ మాత్రమే లభిస్తోందని, దీంతో పేదలు ప్లేట్ లెట్స్, ప్లాస్మా, ప్యాకెట్ సెల్స్ కొరకు వేల రూపాయలు ఖర్చుపెట్టి ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్‌లో కొనాల్సివస్తోందని తెలిపారు. కాంపోనెంట్స్ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. అలాగే అశోకహోటల్‌లో మంత్రిని బీజేపీ నాయకులు కొలిమిరామాంజనేయులు, హరిహరనాథ్, కొలిమిశేఖన్న, పురందర్, వడ్డెరమేష్, శ్రీదేవి, టీడీపీ నాయకులు ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్‌లు కలిశారు. అదేవిధంగా ధర్మహ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ప్రభుత్వాస్పత్రిలో సమస్యలను పరిష్కరించండి

గుంతకల్లు, ఆగస్టు 28: పట్టణంలోని రాయ్‌సాహెబ్ మిడతల హంపయ్య ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలని స్థానిక టీడీపీ, బీజేపీ నాయకులు ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్‌ను కోరారు. ఓ దేవాలయం ప్రారంభోత్సవానికి బుధవారం గుంతకల్లుకు వచ్చిన మంత్రిని స్థానిక టీడీపీ, బీజేపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్ మంత్రిని సన్మానించి, వినాయక విగ్రహాన్ని బహూకరించారు. బీజేపీ నాయకులు కొలిమి రామాంజనేయులు, పసుపుల హరిహరనాథ్, కే శేకన్న, పురంధర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పలు సమస్యలు ఉన్నాయని, సందర్శించి పరిష్కరించాలని విన్నవించారు. మరోసారి వచ్చి సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

ఆర్థిక మంత్రిని కలిసిన కురుబసంఘం నాయకులు

ఉరవకొండ, ఆగస్టు 28: ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్‌ను అమరావతిలోని సచివాలయంలో బుధవారం పట్టణానికి చెందిన కురుబ సంఘం నాయకులు కలిశారు. మంత్రిని శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. అనంతరం కనకదాసు కల్యాణమండపం నిర్మాణం కోసం నిధులు ఇవ్వాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఇచ్చినట్లు సంఘం నాయకులకు తెలిపారు. నాయకులు క్రిష్టప్ప, లింగన్న, గూలెప్ప, వీరన్న, నాగేంద్ర, నాగరాజు, లింగన్న గౌడ్, గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి రూ.40 కోట్లు మంజూరు

కణేకల్లు, ఆగస్టు 28: మండలకేంద్రం నుంచి మాల్యంకు వెళ్లే రహదారిలో హెచ్చెల్సీ అక్విడెక్ట్‌కు సమాంతరంగా బ్రిడ్జి నిర్మాణానికి రూ.40 కోట్లు నిధులు విడుదలయ్యాయని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మండలకంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో తాను మంత్రిగా ఉన్నపుడే బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశానని, వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదన వెనుక్కు వెళ్లిందని అన్నారు. కాగా ఇటీవల తాను సీఎం చంద్రబాబును కలిసి బ్రిడ్జి ఈ ప్రాంతానికి చాలా అత్యసవరమని తెలిపానని, గతంలో ప్రతిపాదనలకు మరింత నిధులు అందించి బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరామని చెప్పారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీతో ఈ విషయాన్ని చర్చించి సాధ్యమైనంత త్వరగా బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరినట్లు ఎమ్మెల్యే వివరించారు. బ్రిడ్జి పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు చిరకాలంగా ఉన్న ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు.

నేమకల్లు అంజన్నకు సింధూరం అలంకరణ



సింధూరం అలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, ఆగస్టు 28: మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి వారు బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో బుధవారం సింధూరం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామునే ప్రధాన అర్చకులు అనిల్ కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు స్వామి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణు పారాయణం, సుదర్శన హోమం, సుందరకాండ పారాయణం చేశారు. తర్వాత సింధూరంతో విశేషంగా అలంకరించి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలు పొందారు. ఈఓ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా శివరామకృష్ణ

తాడిపత్రి, ఆగస్టు 28: పట్టణంలోని మున్సిపల్ నూతన కమిషనర్‌గా శివరామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో పని చేస్తున్న రామ్మోహన్ విజయవాడ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. దీంతో విజయవాడ నగరపాలక జోనల్ కమిషనర్‌గా ఉన్న శివరామకృష్ణ బదిలీపై తాడిపత్రికి వచ్చారు. ఈయన 2014-2019 టీడీపీ హయాంలో తాడిపత్రి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది.

రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా దివాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఉన్న కమిషనర్ కిషోర్ కడపకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి కర్నూలు జిల్లా కూడూరు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న దివాకర్‌రెడ్డి వచ్చారు.

ఇరువర్గాల ఘర్షణ

పెద్దపప్పూరు, ఆగస్టు 28: మండలంలోని ముచ్చుకోట గ్రామంలో బుధవారం వాటర్‌ప్లాంట్ విషయంలో టీడీపీ, వైసీపీ వర్గాలు ఘర్షణపడ్డాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలమేరకు.. వైసీపీకి చెందిన రాము వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తుండేవాడు. ఈ ప్లాంట్ పంచాయతీకి చెందినది కావడంతో టీడీపీకి చెందిన సర్పంచు భర్త నల్లప్ప ప్లాంట్‌ను పంచాయతీకి అప్పగించాలని రాముకు తెలియజేశారు. దీంతో వైసీపీకి చెందిన బాలనాగన్న, నారాయణ కలిసి నల్లప్పపై గొడవకు దిగారు. అక్కడే ఉన్న టీడీపీకి చెందిన రామిగళ్ల రాము, రామాంజి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ గొడవపడడంతో వైసీపీకి చెందిన బాలనాగన్న, టీడీపీకి చెందిన రామిగళ్ల రాము, రామాంజిలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు విచారించి కేసు నమోదుచేస్తామని ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు.

ఇసుకరీచ్ పరిశీలన

కణేకల్లు, ఆగస్టు 28: మండలంలోని రచ్చుమర్రి వద్ద ఉన్న ఇసుకరీచ్‌ను కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుస్మిత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇసుక నాణ్యతను, అక్కడి స్థితిగతులను ఆమె తెలుసుకున్నారు. అలాగే గతంలో సీజ్ చేసిన ఇసుక డంప్‌ను తనిఖీ చేశారు. అనంతరం బెణెకల్లు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వాటర్‌ప్లాంట్‌కు సంబంధించి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, వీఆర్వో పవన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కుందుర్పి, ఆగస్టు 28: మండలంలోని శ్రీమజ్జనపల్లి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మాయదార్లపల్లికి చెందిన వీరభద్ర ద్విచక్రవాహనంలో శ్రీమజ్జనపల్లికి కూలీల కోసం బయలుదేరారు. కొద్దిదూరం వెళ్లగానే తమ్మయ్యదొడ్డికి చెందిన బోరయ్య ఎదురుగా మరో ద్విచక్రవాహనంలో వేగంగా వచ్చాడు. ప్రమాదవశాత్తూ రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో వారిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వీరభద్రను తొలుత కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించి తర్వాత అనంతపురానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. బోరయ్యను కర్నాటక ప్రాంతమైన చెళ్లకెర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత చిత్రదుర్గం తరలించారు. ఆయన పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలిస్తున్నట్లు బంధువులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి పరిశీలించి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

బైక్‌బోల్తా.. ఒకరికి గాయాలు

పుట్లూరు: మండలంలోని గాండ్లపాడు- శనగలగూడూరు గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో పులివెందులకు చెందిన నారాయణస్వామికి గాయాలయ్యాయి. పనినిమిత్తం తాడిపత్రికి వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగింది. గమనించిన వాహనదారులు అతడిని ఆటోలో తాడిపత్రి ఆస్పత్రికి తరలించారు.

ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేయాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 28: ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఆయన తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్చార్జిలు, ఎఫ్‌పీ షాపు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో డివిజన్ లెవెల్ కో-ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సెప్టెంబరు 1న ఉదయం 6గంటల నుంచి ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం, చక్కెర, గోధుమపిండి సరుకులను రేషన్ లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. తూకాలలో ఎలాంటి అవకతవకలు పాల్పడకూడదన్నారు. సరైన సమయంలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు సరుకులను అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.